క్లుప్తంగా

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శుభాకాంక్షలు



కొండాకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, పలువురు నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్రంలో బీజేపీకి మెజార్టీ రావడం, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయం సాధించడం హర్షం వ్యక్తం చేశారు. కొండాను కలిసిన వారిలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హరిభూషణ్‌పటేల్, ఉపాధ్యక్షుడు మంగ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆలయ భూములకు రూ.4.85లక్షల ఆదాయం



వేలం పాటలో పాల్గొన్న గ్రామస్తులు

కొందుర్గు: మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయానికి సంబంధించిన వ్యవసాయ భూములను శనివారం బహిరంగ వేలం వేశారు. ఈ సందర్భంగా గంగన్నగూడ గ్రామ సమీపంలోని 127, 128, 129, తదితర సర్వే నంబర్‌లలో గల 53.21 ఎకరాల భూమిని వేలం వేసినట్లు ఎండోమెంట్ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. వేలం పాటలో నెగ్గి శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నవాజ్‌రెడ్డి, యాదయ్య, రాంరెడ్డిలు భూములను సాగు చేసుకోవడానికి అవకాశం కల్పించుకున్నారు. ఈ సందర్భంగా భూముల వేలం ద్వారా దేవాలయానికి రూ.4.85లక్షలు సమకూరినట్లు ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చకుడు రాజేశ్వరస్వామి, గ్రామస్తులు కావలి యాదయ్య, సత్యనారాయణ, నర్సింలు, బాల్‌రాజ్, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి పల్లకీసేవలో భక్తులు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీసేవలో భక్తుల భజనలు, రామనామకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఆలయ ప్రధాన అర్చకుడు రఘుపతి రావు, రాఘవేంద్రాచార్యులు, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ అభివృద్ధికి, అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు పులిమామడి శ్రీశైలంగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నర్సింలు, వసంతరావు, రఘుగౌడ్, రాఘవేందర్‌గౌడ్, వెంకటేశ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, లక్ష్మణ్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణచారి, శంకర్‌గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సైబర్ క్రైం డీసీపీ నర్సింహా

నందిగామ: సమాజంలో ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీసీపీ నర్సింహా సూచించారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో సైబర్ నేరాలపై సైబరాబాద్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సైబరాబాద్ క్రైం డీసీపీ నర్సింహా హాజరై మాట్లాడుతూ.. సైబర్ నేరస్తులు ఆధునిక పద్ధతులతో మోసానికి పాల్పడుతున్నారని, తక్కువ ధరలకు వస్తువులను అందజేస్తామని, లక్కీ స్కీంలు, డిస్కౌంట్లు, బ్యాంకు అకౌంట్ల అప్‌డెట్, ఆధార్ కార్డులు, ఎల్ఐసీ, ప్రీమియంలపై అను నిత్యం మోసాలు జరుగుతున్నాయన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్, ఈమెయిల్ గురించి గానీ ఏ మాత్రం పట్టించుకోవద్దని వివరించారు. అనుమానం వచ్చినట్లయితే సంబంధిత పోలీసులు లేదా 1930కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైం ఏసీపీలు రవీంద్రారెడ్డి, చంద్రాకాంత్, అధికారులు అభిషేక్ కుమార్, కే. రాజేంద్రప్రసాద్, భానుమూర్తి, శ్రీనివాస్, రమేశ్, పోలీసు సిబ్బంది, పలువురు అభ్యాసీలు తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పు.. దిగుబడి పెంచు

- మార్పిడి చేస్తే ఎంతో ప్రయోజనం
- ఒకే రకమైన సాగుతో దిగుబడి తగ్గే అవకాశం
- మండల వ్యవసాయాధికారి రాగమ్మ





కందిపంట

మొయినాబాద్: ఒకే రకమైన పంట సాగుతో నేలల్లో సారం దెబ్బతిని దిగుబడులు తగ్గి రైతన్నలు నష్టాల పాలవుతున్నారు. చాలామంది రైతులు ఎప్పుడు ఒకే రకమైన పంటలను పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రతీఏటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే వీలుంటుందని మండల వ్యవసాయాధికారి రాగమ్మ తెలిపారు. వానాకాలంలో పంటలు సాగుచేస్తున్న రైతులకు 'పంట మార్పిడి విధానం'పై ఆమె పలు సూచనలు చేశారు.

అవగాహన అవసరం..

పంట మార్పిడి విధానాన్ని అవలంభిస్తే తెగుళ్ల బెడద తగ్గుతుంది. దీనిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. ఒకరిని చూసి మరొకరు వేసిన పంటనే వేస్తూ నష్టాలపాలవుతున్నారు. పంటమార్పుతో నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది. దీంతో చీడపీడల బెడద ఉండదు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించొచ్చు. శిలీంధ్ర తెగుళ్లను దూరం చేయొచ్చు. బీజాలు వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఎక్కువవుతుంది. కీటకాల గుడ్లు వృద్ధి చెందవు. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

రైతులు గమనించాల్సిన విషయాలు..

- భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటను వేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.
- తేలికపాటి నేలలు, ఎర్ర, ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.
- వర్షాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ పంటకాలం కలిగిన కంది, నువ్వులు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలి.
- బంకమన్ను శాతం ఎక్కువగా ఉండే ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి.
- ఇందులో శనగ, బబ్బెర, మినుము, ఉలువలు, పెసర పంటలను వేయడంతో నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను నివారించొచ్చు.
- పత్తి పైరు సాగు చేసిన నేలలో మినుము, పెసర వంటి పంటలతో మార్పు చేయడంతో తెల్లదోమ ఉధృతి తగ్గించొచ్చు.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలను పండించాలి. దీంతో వేరుశనగ పంటలను ఆశించే ఆకుముడత ఉధృతిని నివారించొచ్చు.
- వరిపైరు తర్వాత పప్పు ధాన్యాల పంటలు, నూనె గింజల పైర్లను గానీ పండించడంతో వరిపంటను ఆశించే టంగ్రో వైరస్, దోమ పోటులను సమర్థంగా నివారించొచ్చు.
- పెసర గానీ పశుగ్రాసంగా జొన్న గానీ సాగు చేస్తే తర్వాత వేరుశనగ పంటలు వేసుకోవాలి.

సూచనలు...

- జొన్నసాగు తర్వాత మళ్లీ అదే పంట వేయొద్దు. దీంతో ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చ పురుగు ఆశించొచ్చు.
- వేరుశనగ తర్వాత ఆముదంతో పంట మార్పిడి చేసుకోవచ్చు.
- నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, బెండ, టమాటా, మినుము, పెసర పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి.
- వానాకాలంలో వరి సాగుచేసే భూముల్లో ఆరుతడి పంటలు జొన్న, మొక్కజొన్న, శనగ, పెసర, బబ్బెర, మినుములు, ఉలువలు, ఇతర కూరగాయ పంటలు సాగుచేసుకోవడం మంచిది.



మొక్కజొన్న పంట

ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: రాష్ట్రంలో ప్రభుత్వ బడుల బలోపేతానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలతో కలిసి విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు అందించి, చిన్నారులతో విద్యాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాలల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా నాయకులు కృషి చేయాలన్నారు.

జిల్లాలో బదిలీలు చేపట్టాలని వినతి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలకు ఇటీవల శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో తప్పా రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ కొనసాగుతోందని, జిల్లాలో కూడా బదిలీల ప్రక్రియ కొనసాగే విధంగా చూడాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. బదిలీల ప్రక్రియ లేకపోతే ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజీం అలీ, ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్, మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేశ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, నాయకులు జగదీశ్వర్, వీరేశ్, శ్రీధర్‌రెడ్డి, సురేశ్, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, శ్రీనివాససాగర్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథపై ఇంటింటి సర్వే

చేవెళ్ల: గ్రామంలో ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ ఉందా లేదా ఉంటే నీరు అందుతుందా అనే విషయాలను తెలుసుకునేందుకు ఇంటింటికీ మిషన్ భగీరథపై సర్వే నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు కాలనీల్లో శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి నల్లా కనెక్షన్ వివరాలతో పాటు ఇంటి యజమాని ఆధార్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. దీంతో ప్రతి గ్రామంలో ఉన్న నల్లా కనెక్షన్‌ల వివరాలు తెలుస్తాయన్నారు. ఈ సర్వేతో అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. కనెక్షన్‌లు లేని వారికి ఇచ్చేందుకు అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. ప్రజలు అందరూ సర్వేకు వచ్చిన పంచాయతీ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ సర్వేలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చేవెళ్లలో సర్వే నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలి

జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్



మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్

మొయినాబాద్‌రూరల్: పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం చేపడుతున్న అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల ఉద్యోగులు కృషి చేయాలని జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్ అన్నారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో విద్య, వైద్య, అంగన్‌వాడీ, పంచాయతీ కార్యదర్శులతో ఈ కార్యక్రమ విజయవంతంపై సదస్సు నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ వాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. నులిపురుగుల నిర్మూలనకు 12 నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలు, ఆరు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల పిల్లలకు పాఠశాలలు, కళాశాలల్లో జూన్ 25వ తేదీ నుంచి తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. మందులు రెండు రోజుల్లో సంబంధిత పాఠశాలలకు, ఆరోగ్య కార్యకర్తల ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నామని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 25న జరిగే నులిపురుగుల నివారణకు చేపడుతున్న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాణి, ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

శంకర్‌పల్లి: దుకాణాల ఎదుట అవకాశం ఉన్న ప్రతి ఒక్క యజమాని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని శంకర్‌పల్లి డీఐ నాగరాజు సూచించారు. శనివారం పట్టణంలోని బీడీయల్ చౌరస్తాలో దుకాణాదారులకు నేరాలపై అవగాహన కల్పించారు. డీఐ మాట్లాడుతూ.. దొంగలు చాలా వరకు తాళం వేసిన ఇళ్లు, దుకాణాలే లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్నారని, దొంగలను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అదే విధంగా అపరిచితుల నుంచి వచ్చే మెసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కి స్పందించొద్దని సూచించారు. పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న డీఐ

'ప్రజాపాలన'ను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షాబాద్ ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 8 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతీష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మల్లేశం తదితరులు ఉన్నారు.



దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీడీఓ అపర్ణ, తదితరులు

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న మధుసూదన్‌రెడ్డి

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు తమవంతుగా సహకారం అందించాలని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా ఆయన శనివారం మండలంలోని కొడిచర్ల, ఖాజిగూడ తండాల్లో పర్యటించారు. అనంతరం రెండు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పలు అభివృద్ధి పనుల నిమిత్తం మండల పరిషత్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారు. విద్యార్థులను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఖాజిగూడతండాలోని పాఠశాలలో చిన్నారులతో ఆయన అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల దందా

ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయని వీటిపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించటం లేదని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో శనివారం పుస్తకాలు అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడికి వెళ్లి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమకు వచ్చిన సమాచారంతో పాఠశాలకు వెళ్లి చూడగా అక్కడ పుస్తకాలు విక్రయిస్తున్నట్లు కనిపించటంతో వాటిని చూసి ప్రశ్నిస్తే పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థి సంఘం నాయకులపైనే ఎదురుదాడి చేస్తూ దురుసుగా మాట్లాడుతూ దూషించారన్నారు. అంతేకాకుండా జీఓ 1కు విరుద్ధంగా పుస్తకాలు అమ్ముతున్నారని ప్రశ్నిస్తే అమ్మకుంటాం అన్ని పాఠశాలల్లో అమ్ముతలేరా ఏమి చేసుకుంటారో చేసుకోండి.. ఎవరికి ఫిర్యాదు చేస్తారో చేసుకోండి అంటూ దబాయించారని పేర్కొన్నారు. దీనిపై అక్కడి నుంచే మండల విద్యాధికారి అక్బర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశామని తెలిపారు. కానీ ఆయన తాను 3గంటలకు వస్తాను అప్పుడు పాఠశాల యాజమాన్యం, మీరు మేము కలిసి కూర్చొని మాట్లాడుకుందామని చెప్పారన్నారు. ఎంఈఓ అక్బర్ పాఠశాల యాజమాన్యానికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇలాంటి నిర్లక్ష్య అధికారుల మూలంగా విద్య వ్యాపారంగా కొనసాగుతుందని చెప్పారు. దీనిపై వెంటనే ఉన్నతాధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ముందే పుస్తకాలతో ధర్నా చేశారు. ఈ పాఠశాలపై, ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఛలో చేవెళ్ల కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయి, గణేశ్, తదితరులు ఉన్నారు.

ఆర్మీ ఉద్యోగులకు సన్మానం



ఆర్మీ ఉద్యోగులను సన్మానిస్తున్న కోచ్ గిరి

షాద్‌నగర్‌రూరల్: ఆర్మీ ఉద్యోగాలు సాధించి శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన ఉద్యోగులను శనివారం యువ సైనిక్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చల్మారెడ్డి, జహీరాబాద్ జిల్లాకు చెందిన సాగర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన వేదాన్స్, కల్వకుర్తికి చెందిన శేషికుమార్ పట్టణంలోని యువసైనిక్ డిఫెన్స్ అకాడమీలో ఆర్మీ ఉద్యోగాల్లో శిక్షణ తీసుకున్నారు. ఆర్మీ అగ్నివీర్ పరీక్షలో ఉత్తీర్ణతను సాధించి ఉద్యోగాలను పొందారు. 2023 బ్యాచ్‌లో 7 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు పట్టణానికి వచ్చిన సందర్భంగా అకాడమీ యాజమాన్యం, నేషనల్ అథ్లెట్ కోచ్ గిరి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ గిరి మాట్లాడుతూ.. 2024 సంవత్సరం నోటిఫికేషన్ ఆర్మీ అగ్నివీర్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 20 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాచారం కోసం 9493434907, 9848947484 ఫోన్ నంబర్‌లను సంప్రదించాలని కోరారు.

ఎమ్మెల్యేకు స్వాగతం

చేవెళ్ల: ఇటీవల అమెరికాలో జరిగిన 18వ ఆట మహాసభలకు వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు చేవెళ్ల బీఆర్ఎస్ పార్టీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి.నర్సింలు, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్యలు స్వాగతం పలికారు. శనివారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయనను కలిసిన వారు శాలువా కప్పి స్వదేశీ ఆగమన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అమెరికా ప్రయాణం విశేషాలను అడిగి తెలుసుకున్నారు.



ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న నాయకులు

విద్యుత్ తీగలను సరిచేయరూ!



ఇళ్లపై వేలాడుతున్న తీగలు

కొత్తూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ పంచాయతీ చౌరస్తా కాలనీలో ఇళ్లపై నుంచి వేసిన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే కాలనీలో పలువురు విద్యుత్ తీగల కారణంగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కాగా కిందకు ఉన్న తీగలను సరిచేయాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి ఎలాంటి స్పందన లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని వారు కోరుతున్నారు.